# పోతులూరి బోధనలు స్ఫూర్తి

- విశ్వకర్మ యువ యాత్ర ప్రారంభంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

కవాడిగూడ, జూన్ 22: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బోధనలను యువత స్ఫూర్తిగా తీసుకొని సన్మార్గంలో పయనించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. ట్యాంక్ బండ్‌పై ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని ముఖ్యఅతిథిగా పాల్గొని పోతులూరి విగ్రహానికి పూల మాలవేసి విశ్వకర్మ యువ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి భవిష్యత్‌ను ముందే అంచనా వేసి రాసిన కాలజ్ఞానం ఎంతో ప్రసిద్ధి చెందిందని గుర్తుచేశారు. ఆయన తన కాలజ్ఞానంలో పేర్కొన్న అనేక ఘటనలు నిజమయ్యాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రస్తావించారు. విశ్వకర్మ సంఘంలోని యువత ఐక్యతను చాటేందుకు యువయాత్రను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ట్యాంక్‌బండ్ నుంచి వివిధ వాహనాలతో ప్రారంభమైన ర్యాలీ శ్రీశైలం వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, సంఘం నాయకులు విశ్వనాథుల పుష్పగిరి, సోల్లేటి ప్రభాకరాచారి, శివరాం తదితర విశ్వకర్మలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ట్యాంక్ బండ్‌పై ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద పూలమాలలతో నివాళులర్పిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

## విద్యార్థులకు వచన కవిత రచన పోటీలు

ముషీరాబాద్, జూన్ 22: చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యార్థులకు వచన కవితా రచన పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు చిమ్మపూడి శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఆపై చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని, విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 30లోగా విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వచన కవిత రచన పోటీలు జూలై 6న చిక్కడపల్లి త్యాగరా గానసభలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించినట్లు, ఇతర వివరాలకు 97041 77270 ఫోన్ నంబర్ నందు సంప్రదించవలసిందిగా కోరారు.

## గానసభ మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం



చిక్కడపల్లి, జూన్ 22: చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ఆదివారం సాయంత్రం మొదటి అంతస్తులోని కళామారుతీ హాల్లో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. నిర్వాహకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేశారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో మంటలు రావడంతో ప్రేక్షకులు వెంటనే బయటికి వచ్చేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

## మసీదు వీధిలో సీసీ పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బన్సీలాల్‌పేట్, జూన్ 22: మసీదు వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.12.5 లక్షల నిధులను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు బీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జావేద్ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా మసీదుకు వెళ్లే వారు శిథిలావస్థకు చేరిన రోడ్ల వలన చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పగానే ఎమ్మెల్యే స్పందించారని ఆయన అన్నారు. ఆదివారం రోడ్డు పనులు మొదలు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మిపతి, నుస్రత్, కరీమ్, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న పోలీసులకు వీడ్కోలు



ఎస్సై శ్రీకాంత్‌కు పూలమొక్కను అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ మధుబాబు, సిబ్బంది

బొల్లారం, జూన్ 22: తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించి బదిలీపై అబిడ్స్ శాంతి భద్రతల పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న ఎస్సై శ్రీకాంత్, నలుగురు ట్రాఫిక్ సిబ్బందిని ఆదివారం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మధుబాబు సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారి సేవలను అభినందించారు. కార్యక్రమములో దీను ప్రకాష్, బాలు నాయక్, లక్ష్మినారాయణ, రమేష్, నాయుడు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న అనాథలు, నిరాశ్రయులకు ఆహారం అందించామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. 279వ అన్నదాన కార్యక్రమములో సంస్థ సభ్యులు రాజేందర్ పాల్గొన్నారు.
– బన్సీలాల్‌పేట్



## కంప్యూటర్లు, కలర్ ప్రింటర్ అందజేత



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన టెరాపంత్ యువక్ పరిషత్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, జూన్ 22: టెరాపంత్ యువక్ పరిషత్ తరపున మేకలమండి ప్రభుత్వ పాఠశాలకు రెండు కంప్యూటర్లు, ఒక కలర్ ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. నూతన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థుల డిజిటల్ విద్యకు ఎంతో ఉపయోగకరమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.స్వరూప అన్నారు. ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు రమేష్ జీ దాగా, ఉపాధ్యక్షుడు పవన్ జీ మండోట్, హైదరాబాద్ అధ్యక్షుడు అభినందన్ జీ నహతా అతిథులుగా పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా '5కే రన్'

ఖైరతాబాద్, జూన్ 22: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్లో 5కే రన్ నిర్వహించారు. రన్‌ను ట్రస్ట్ చైర్మన్, విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ సయ్యద్ ఉమర్ అలీ షా జెండా ఊపి ప్రారంభించారు. కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ప్రొగ్రామ్ కన్వీనర్ సూర్యలత మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్ అభివృద్ధికి కృషి

చిక్కడపల్లి, జూన్ 22: బలిజ కులస్తుల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడుగా నియమితులైన సంగమేశ్వర్ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్ అధ్యక్షత వహించగా రాచప్ప, సెంట్రల్ కమిటీ సభ్యులు శెట్టిశివ, యువజన సంఘం కార్యదర్శి పటోళ్ల భరత్, ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు అశ్విని, నగర అధ్యక్షుడు శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.



వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్‌కు సన్మానం చేస్తున్న నాయకులు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కును బాధితులకు అందజేస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

బొల్లారం, జూన్ 22: సీఎం సహాయనిది పేదలకు దోహదపడుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం న్యూబోయిన్పల్లిలోని తన కార్యాలయంలో నేతాజీనగర్‌కు చెందిన మహమ్మద్ శంషాద్‌కు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చొరవతో మంజూరైన రూ.19వేల విలువ గల చెక్కును బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హసీన్ ఖాన్ పాల్గొన్నారు.

## విలువలతో కూడిన విద్యను అందించాలి



విద్యార్థులకు బహుమతులు అందించినచిన్మయ మిషన్ రెసిడెంట్ ఇంచార్జి స్వామి సర్వేషానంద

చిక్కడపల్లి, జూన్ 22: చిన్న నాటి నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక విలువలు పెంచాలని తల్లి తండ్రులకు చిన్మయ మిషన్ రెసిడెంట్ ఇంచార్జి స్వామి సర్వేషానంద సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో న్యూఎరా జూనియర్ కళాశాల, సెయింట్ ఆడమ్స్ స్కూల్ అధినేత డాక్టర్ శ్రీభాష్యం శ్రవణ్ కుమార్ నేతృత్వంలో పేరెంట్స్ ఓరియెంటేషన్ అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి సర్వేషానంద హాజరై ప్రసంగిస్తూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా పిల్లలలో భవిష్యత్తు ఉజ్వలంగా ముందుకు సాగే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యతో పాటు సనాతన ధర్మం, ఆధ్యాత్మిక విలువలు, మహనీయుల గురించి వివరించడం ద్వారా నడవడికతో గొప్ప మార్పులు వస్తాయని అన్నారు. డాక్టర్ శ్రీభాష్యం శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ తలితండ్రులతో ఈ విధంగా సమావేశాలను నిర్వహించడం ద్వారా వారి పిల్లల పట్ల మరింత శ్రద్ధ తీసుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.

## నేడు లష్కర్‌లో కరెంటు ఉండని ప్రాంతాలు

బేగంపేట్, జూన్ 22: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏడీఈ కార్యాలయం పరిధిలో నిర్దేశించిన సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ అధికారులు తెలిపారు. డివిజన్లోని లాలాగూడ సబ్ స్టేషన్ పరిధిలోని నేడు (సోమవారం) సెయింట్ ఆన్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యానికేతన్, సెయింట్ ఆన్స్ జూనియర్ కాలేజ్ తదితర ప్రాంతాలు, అలాగే చెన్నారెడ్డి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లంబాడి బస్తీ, కనకదుర్గ అపార్ట్మెంట్, సండే మార్కెట్ ఏరియా, విజయ డైరీ, ఘరోండ అపార్ట్మెంట్, డెవిడ్ మెమోరియల్ కాలేజ్ ప్రాంతాల్లో పై విధంగా విద్యుత్ నిలిపి వేయనున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

## నేడు ఆజామాబాద్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జూన్ 22: టీఎస్ఎస్ పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి రామాలయం, శివం ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్న ట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపా రు. ఉదయం 10 నుంచి మధ్యా హ్నం 1 గంట వరకు రామాలయం ఫీడర్ పరిధిలోని న్యూనల్లకుంట, సిండికేట్ బ్యాంక్, నరేంద్ర పార్క్, రామాలయం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యా హ్నం 2నుంచి సాయంత్రం 5 గంట ల వరకు శివం ఫీడర్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, శివాలయం టెంపుల్, టీఆర్‌టీ క్వార్టర్స్, నరసిం హ బస్తీ, తరుణి సూపర్ మార్కెట్, విద్యానగర్ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

## ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

చిక్కడపల్లి, జూన్ 22: ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 29వ వేడుకలను ఆదివారం గోల్కొండ క్రాస్ రోడ్స్‌లోని ఎంబీ బేతెల్ చర్చిలో ఘనంగా నిర్మించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. క్రైస్తవుల సంక్షేమ కోసం పనిచేస్తున్న ఫెడరేషన్ ఇదే విధంగా ముందుకు సాగాలని సూచించారు. పలువురు బిషప్‌లు, పాస్టర్స్, క్రిస్టియన్ ప్రముఖులు పాల్గొని తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఏ గిడియన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రెవ.డాక్టర్ డేవిడ్ కడారి, ఆర్చ్ బిషప్ ఎమ్మెస్ దయానంద్, కువైట్‌కు చెందిన కళ్యాణి చొప్పల, ఏఐసీఎఫ్ ఉమెన్స్ చైర్‌పర్సన్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



కొండాపూర్, జూన్ 22: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీక్షలయా గురువర్యులు లక్ష్మీశంకర్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యం అలరించింది. జగదానందకారకా, జతిస్వరం, గీత రసికే, మండూకశబ్దం, అప్సరసలు, నమశ్శివాయతే, వందే మీనాక్షి, రామాయణ శబ్దం, పరమ పురుషుడు, మంగళం అంశాలను ఆద్య, ఆశ్రిత, అమృత, అవంతిక, అవిజ్ఞా, గాయత్రి, వెంకట్, జీవిత, కార్తీక, నందిని, పూర్వీక, రితిక ప్రదర్శించిన తీరు ఆద్యంతం ఆకట్టుకున్నది.

## సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

చర్లపల్లి, జూన్ 22: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈఓ, మౌలాలి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాడు సురేశ్ పేర్కొన్నారు. హెచ్‌బీకాలనీ డివిజన్ చైతన్యనగర్ డబుల్ బెడ్‌రూం డీగ్నిటీ హౌసింగ్ కాలనీ సంక్షేమ సంఘం, మౌలాలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈఓ సురేశ్, ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం ప్రారంభించా రు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, కిష్టయ్య, శ్రీనివాస్, వాణి, కల్యాణి, శోభారాణి, టీవీ.రమణ, నాయకులు నరేశ్, లక్ష్మీనారాయణ, బ్రహ్మయ్య, మురళి, మధు, ప్రభాకర్, డెవిడ్, చందు, సీతమహాలక్ష్మి, లక్ష్మి, జ్యోతి, రజనీ, లక్ష్మి, భాదల్‌లతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

శామీర్‌పేట, జూన్ 22: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట( శామీర్‌పేట)లో వచ్చే విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇశ్రత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 వరకు ఉన్న గడువును 25వ తేదీ వరకు పొడిగించామన్నారు. కళాశాలలో బీఎస్సీ( బీజడ్‌సీ, ఎంజడ్సీ, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్‌సీఎస్ హానర్స్, బీకాం, బీఎం కంప్యూటర్స్, బీఏ కోర్సులు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన షెడ్యూల్ క్యాస్ట్ అభ్యర్థులు ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి మార్కుల మెమో, ఇంటర్ మార్కులు మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, ఇంటర్ టీసీ, 8 పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలకు వచ్చి 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

హిమాయత్‌నగర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు.

## విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను ఛేదించాలి

బేగంపేట్, జూన్ 22: విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేధించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాంగోపాల్పేట్ డివిజన్ పరిధిలోని 10వ, ఇంటర్, డిగ్రీ స్థాయిలో మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, నోటుబుక్కులు ప్రదానం జరిగింది. ఆదివారం రాణిగంజ్లోని జైన్ భవన్లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలోనే స్కాలర్‌షిప్ అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే సుమారు 4 వందల మంది విద్యార్థులకు ఉచితంగా నోట్బుక్స్ పంపిణీ చేశారు.



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

## ఆపరేషన్ కగార్ తక్షణమే ఆపాలి

శంషాబాద్ రూరల్, జూన్ 22: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి మావోయిస్టుతో శాంతిచర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్య భారతంలో మావోయిస్టుపై దారుణమైన హింసాకాండ కొనసాగించడం, భారీ ఎత్తున బలగాలను మొహరించి వారిని హతమార్చాలనే కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టులు లేకుండా చేయడమే తమ ఎజెండగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశాభివృద్ధికి కాకుండా కేవలం అమాయక గిరిజన, అడవి బిడ్డలను చంపేయడం ఏమిటని నిలదీశారు. రాష్ట్రంలో కార్పోరేట్ విద్యాసంస్థలు కాన్వెంట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూల్ చేసి విద్యా సంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చడం దారుణమని మండిపడ్డారు. విద్యను అంగట్లో సరుకులాగా మార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికఫీజులు వసూల్ చేస్తున్న పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు